క్లుప్తంగా

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు



ఎమ్మెల్యేకు జ్ఞాపిక అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని రెడ్డి సేవా సమితి నాయకులు ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన రెడ్డి సేవా సమితి నాయకులు ఎమ్మెల్యేను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు మదన్ మోహన్‌రెడ్డి, గుర్రం రవీందర్‌రెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, దంగు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్

మొయినాబాద్: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సురంగల్‌లో గ్రామానికి చెందిన గుమ్మళ్ల సీతారాంరెడ్డి నిర్వహించిన సురంగల్ ప్రీమియర్ లీగ్ సీజన్–3 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత సామాజిక మాధ్యమాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. తమ ఖాళీ సమయాన్ని క్రీడలకు కేటాయించి రాణించాలన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందన్నారు. యువతను ప్రోత్సహించేందుకు టోర్నమెంట్ నిర్వహించిన సీతారాంరెడ్డిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం



సురేశ్‌గుప్తాను సన్మానిస్తున్న మండల ఆర్యవైశ్య సంఘం సభ్యులు

చేవెళ్ల: ఆర్యవైశ్యులను ఏకం చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు గందె సురేశ్‌గుప్తా అన్నారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన గందె సురేశ్‌గుప్తాను ఆదివారం చేవెళ్ల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంకటేశంగుప్తా ఆధ్వర్యంలో సంఘం సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ఆర్యవైశ్యలను ఏకం చేసేందుకు కృషిచేస్తానన్నారు. ఆర్యవైశ్యులందరూ కలిసిమెలసి ఉండాలని, సంఘం సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రభు, మధుసూదన్, సచిన్, రాఘవేందర్, భద్రసేన ఉన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీత



చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న నాయకులు, రైతులు

కడ్తాల్: రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత అన్నారు. ఆదివారం మండల పరిధి టాక్‌రాజు గూడతండాకు చెందిన గిరిజన రైతులు, నాయకులు చైర్‌పర్సన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం.. సబ్సిడీపై సాగు పరికరాలను అందిస్తోందని తెలిపారు. ధాన్యం క్వింటాలుకు రూ.500లు బోనస్ ఇస్తుందని, సంక్రాంతి నుంచి రైతుభరోసా ఇవ్వనుందని పేర్కొన్నారు. లబ్ధిదారులందరూ కాంగ్రెస్ సర్కార్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు బలరాంనాయక్, భీమానాయక్, జగన్‌నాయక్, బీమ్లా, లాలునాయక్, కిషన్ నాయక్ ఉన్నారు.

గుంతలు పడి.. కంకర తేలి

గ్రామీణ రోడ్లు గుంతలు పడి, కంకర తేలి అధ్వానంగా మారాయి. కనీసం నడిచివెళ్లేందుకు కూడా వీలులేని పరిస్థితికి చేరాయి. ఇక ద్విచక్రవాహనదారులు, పెద్ద వాహనాలపై రాకపోకలు చేసేవారికి నరకం చూపిస్తున్నాయి. ఈ రోడ్లపై వాహనాలు బోల్తాపడి వాహనదారులు గాయాలపాలవుతున్నారు. ఏళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో అధ్వానంగా మారాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని రోడ్లు
- అధ్వాన దారులపై తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



అధ్వానంగా కొందుర్గు-ఉమ్మెంత్యాల రోడ్డు

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ దారుల గుండా వెళ్లాలంటేనే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రిపూట గుంతల రోడ్లపై ప్రయాణం నరకంగా మారిందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కొందుర్గు నుంచి ఉమ్మెంత్యాలకు వెళ్లే బీటీరోడ్డు అడుకో గుంత అన్న చందంగా మారింది. అదేవిధంగా కొందుర్గు మండల కేంద్రం నుంచి వయా తూంపల్లి మీదుగా జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రానికి వెళ్లే దారికి మరమ్మతుల కోసం తవ్వి అలాగే వదిలేయండంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గుంతలు పడి, కంకర తేలిన రోడ్లపై వాహనాలు బోల్తాపడి ప్రమాదాలు సైతం జరిగాయని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

అడుగుకో గుంత..

కొందుర్గు నుంచి ఉమ్మెంత్యాలకు వెళ్లే బీటీరోడ్డుపై అడుగుకో గుంతతో పాటు కంకర తేలడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా కొందుర్గు మండల కేంద్రం నుంచి వయా తూంపల్లి మీదుగా జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రానికి వెళ్లే దారికి మరమ్మతులు చేయడంలో భాగంగా రోడ్డు తవ్వి ఏడాది కావొస్తున్నా నేటికీ పనులు చేయడం లేదు. రోడ్డు మధ్యలో తవ్వకుండా వదిలేసిన ఒక మీటరు వెడల్పు గల రోడ్డుపైనే వాహనదారులు వెళ్తున్నారు. అయితే వాహనం ఎదురుగా వస్తే రోడ్డు దిగడానికి రావడం లేదని, రోడ్డు దిగితే కింద పడిపోవాల్సిందేనని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే పలువురు కిందపడి ప్రమాదాలకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని అధికారులను అంటున్నారే తప్పా బాగు చేయడం లేదు.



కొందుర్గు-చౌదరిగూడ రోడ్డు దుస్థితి

మరమ్మతులు చేపట్టాలి



రోడ్డుపై వెళ్లాలంటేనే భయంగా ఉంది. వాహనాలపై కొత్తవారు వస్తే ఎప్పుడు ఏ గుంతలో పడి ఎలాంటి ప్రమాదాలకు గురవుతారోనన్న భయంగా ఉంది. పేరుకు బీటీరోడ్లు తప్పా రోడ్డుపై బీటీ కనిపించని దుస్థితికి చేరాయి. దెబ్బతిన్న రోడ్లకు వెంటనే రీబీటీ చేయించాలి.

–కావలి గోపాల్, ముట్పూర్

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



దెబ్బతిన్న రోడ్ల వివరాలు సేకరించి మరమ్మతులకు కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ఉమ్మెంత్యాల, రేగడిచిల్కమర్రి, చిన్నఎల్కిచర్ల రోడ్లు అధ్వానంగా మారాయి. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం ద్వారా నిధుల మంజూరుకు కృషిచేస్తాం.

–లక్ష్మీఅనురాధ, ఎంపీడీఓ

బీసీలకు రిజర్వేషన్ కల్పించాలి



కమిటీ అధ్యక్షుడిగా మచ్చేందర్‌కు నియామకపత్రం అందజేస్తున్న కృష్ణ

బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ

షాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాందార్‌ఖాన్‌పేట్ గ్రామంలో బీసీ సేన గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మేకల మచ్చేందర్, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, నాగేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శిగా నర్సింలు, కార్యదర్శులుగా రాఘవేందర్, తాజ్, సలహాదారుగా సురేశ్, సభ్యులుగా వినోద్‌గౌడ్, రాజ్‌కుమార్, నందుచారి, శివలింగం, నరేందర్, శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు 42శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో కేటాయించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీ లెక్క తేలడానికి దేశ వ్యాప్తంగా కులగణన చేయాలని, పంచాయతీరాజ్ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమలో బీసీ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం

మొయినాబాద్: ఇరవై ఐదేళ్ల క్రితం ఒకే పాఠశాలలో చదివిన 130 మంది పూర్వ విద్యార్థులు, వారికి విద్యాబుద్ధులు నేర్పిన 35 మంది ఉపాధ్యాయులు ఆదివారం ఒకే వేదికపై కలుసుకున్నారు. ఆత్మీయ పలకరింపులతో గురువులకు పాదాభివందనం చేశారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ విద్యా అరణ్య ఆవాస విద్యాలయం (శారదా దామం)లో 1999–2000 సంవత్సరంలో 10వ తరగతి చదివిన వారందరూ ఆదివారం మొయినాబాద్ మండలంలోని నాగిరెడ్డిగూడలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. అందరూ ఒకచోట చేరి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల రోజులను గుర్తుచేసుకుని, నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన 35 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. రోజంతా సరదాగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు యాలాల జైపాల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఘనంగా అయ్యప్ప పడిపూజ



మొయినాబాద్, రూరల్: పడిపూజ నిర్వహిస్తున్న స్వాములు



చేవెళ్ల: పూజలో పాల్గొన్న నాయకులు

చేవెళ్ల: స్వామి శరణం.. అయ్యప్ప శరణం అంటూ అయ్యప్ప స్వామి నామస్మరణతో ఊరేళ్ల గ్రామం భక్తిభావంతో నిండిపోయింది. మండలంలోని ఊరేళ్ల గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్ద ఆదివారం గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్ ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పూజ అనంతరం అయ్యప్ప మాలధరించిన స్వాములు ఇరుముడులతో శబరిమలకు బయలుదేరారు. ఈ పూజల్లో ఎమ్మెల్యే కాలె యాదయ్య, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పి.కార్తీక్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులను మాజీ వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్ శాలువాలు కప్పి సన్మానించారు. అయ్యప్ప మాలధరించిన స్వాములకు, వచ్చిన ప్రజలకు, భక్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

మొయినాబాద్, రూరల్: మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ బూరుగు రవళీ గోపికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. పూజల అనంతరం స్వాములకు అన్నదానం చేశారు. అయ్యప్ప నామస్మరణతో గ్రామ వీధులు మార్మోగాయి. కార్యక్రమంలో మండల విశ్వకర్మ గౌరవ అధ్యక్షుడు వడ్ల నర్సింహాచారి, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, ప్రజలు తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న దాతలు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని హాజిపల్లి రోడ్డు విజయనగర్‌కాలనీలో గల వీరాంజనేయ సహస్ర లింగేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి ఆదివారం పట్టణానికి చెందిన దాతలు ఎలుకుర్తి నారాయణ, ఎలుకుర్తి శ్రీనివాస్ లక్ష రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు విరాళం అందజేశారు. అనంతరం దాతలను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బాలగోపాల్, శంకర్‌రెడ్డి, ఎలికట్ట శేరివెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బాలయ్య, వెంకట్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, భగవంత్‌గౌడ్, లింగం, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎంసాని శ్రీనివాస్, నర్సింలు, నీలరవి, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



టోర్నీని ప్రారంభిస్తున్న నాయకులు

షాద్‌నగర్: మండల పరిధిలోని దూసకల్ గ్రామంలో ఆదివారం డీపీఎల్ (దూసకల్ ప్రీమియర్ లీగ్)ను ప్రారంభించారు. ఈ టోర్నీని షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చటాన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నేత నందారం అశోక్‌యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు ప్రకాశ్‌యాదవ్, మహేందర్, ఖాజా, మాజీ సర్పంచ్ మురళీధర్ రెడ్డి, నాయకులు శివకుమార్, మహేశ్, శివ, నందు, మాధవరెడ్డి, శ్రీధర్‌గౌడ్, అంజి, హరికుమార్, శ్రీరాం, మల్లేశ్, ప్రేమ్, రమేశ్, నాని, జగన్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మంచాల: మండల పరిధి చిత్తాపూర్ గ్రామంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. మరో 20 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సాదురం ఇబ్రహీంపట్నం వైద్యశాల వైద్యులు ఎమ్మెస్ రెడ్డి, భగవాన్, మాజీ సర్పంచ్ నాగరాజ్ గౌడ్, నాయకులు బాలరాజ్, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీని కలిసిన నాయకులు



మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డితో నాయకులు

చేవెళ్ల: రాబోయే స్థానిక సంస్థల్లో పార్టీని గెలిపించేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. నగరంలోని ఆయన నివాసంలో కలిసిన నాయకులు శాలువాతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వారితో చేవెళ్ల రాజకీయాలపై చర్చించారు. నాయకులందరూ కలిసికట్టుగా పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తాచాటాలని తెలిపారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.ఆగిరెడ్డి, మొయినాబాద్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కాలె శ్రీకాంత్, దామరగిద్ద మాజీ సర్పంచ్ ఆర్ మధుసూదన్‌గుప్తా, చేవెళ్ల మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఆమనగల్లు: మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నగరంలోని ఆయన నివాసంలో ఆదివారం పట్టణంలోని విద్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాష, కార్యదర్శి జంగయ్య, సభ్యులు చుక్క అల్లాజీగౌడ్, నర్సింహ, రమేశ్ తదితరులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం కాలనీలో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి ట్రాన్స్‌ఫార్మర్, కృష్ణ తాగునీటి పైపులైన్, మురుగు కాలువలు, కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధులు మంజూరు, ఎంపీడీఓ కార్యాలయం, జెడ్పీహెచ్‌ఎస్ చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడంతో పాటు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని, పట్టణాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చినట్లు నేతలు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి, నాయకులు సంజీవ్‌యాదవ్, యాదగిరి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండండి



మాట్లాడుతున్న భూపాలచారి

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలచారి

కొందుర్గు: త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలకు అందరూ సిద్ధంగా ఉండాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి సూచించారు. ఈ సందర్భంగా చౌదరిగూడలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రజల తరఫున ఉంటూ ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, మండల కమిటీ అధ్యక్షుడు కురుమయ్య, నాయకులు కృష్ణారెడ్డి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి



అమ్మవారి వెండి ప్రతిమను బహూకరిస్తున్న విజయభాస్కర్‌రెడ్డి కుటుంబసభ్యులు

మొయినాబాద్, రూరల్: ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని అమ్డాపూర్ రక్తమైసమ్మ దేవాలయ చైర్మన్, మాజీ సర్పంచ్ గుంటం నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అమ్డాపూర్ రక్త మైసమ్మ దేవాయానికి శంషాబాద్ మండల పరిధిలోని రాళ్లగూడకు చెందిన మాదిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి 3 కిలోల వెండి కవచారుని అమ్మవారి రూపాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు ఎంతో మహిమగలవారని, కోరిన కోర్కెలు తీర్చే తల్లీ అని పేర్కొన్నారు. వారిని ఆలయ చైర్మన్ నర్సింహారెడ్డి, గ్రామస్తులు సాయిపాల్‌రెడ్డి, అర్చకుడు అంజన్నశాస్త్రి ఘనంగా సన్మానించారు.

దేవాలయాల అభివృద్ధికి సహకరించాలి



ఆలయానికి రథాన్ని అందజేస్తున్న వెంకటేశ్‌గుప్తా

మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు

షాద్‌నగర్: దేవాలయాల అభివృద్ధికి అందరూ సహకరించాలని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు అన్నారు. ఆదివారం పట్టణానికి చెందిన ఆకుల వెంకటేశ్‌గుప్తా, అరుణ దంపతులు పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయానికి టేకులతో తయారు చేయించిన అంతరాలయ రథాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భగవంతుడికి సేవచేస్తే ఆత్మసంతృప్తి కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని సూచించారు. ఎంతో పురాతనమైన వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. వెంకటేశ్, అరుణ దంపతులు తన కుమారుడు కీర్తిశేషులు రాఘవేందర్ జ్ఞాపకార్థం దేవాలయానికి రథాన్ని అందజేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో భక్తులు పలబట్ల బాల్‌రాజ్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఒగ్గు కిషోర్, సాయిఈశ్వర్‌రెడ్డి, సూరిశెట్టి నర్సింహాగుప్తా, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.